# 6

# "యేసు మీద లక్ష్యముంచుడి"

## (3:1-14)

"ఇందువలన" అన్న మాటతో హెబ్రీయులకు 3:1 ప్రారంభమవుతుంది. అంటే, ఇది ఇదివరకటి విషయంతో సంబంధించియుంటుంది అని సూచిస్తుంది.[1] "ఇందువలన [ఇదివరకు చెప్పబడిన వాటిని బట్టి], ... యేసుమీద లక్ష్యముంచుడి" (1 వ.). ఈ పత్రిక యొక్క అసలు గ్రహీతలు, వారు ఒప్పుకున్నా, లేకపోయినా వారు యేసును విడిచిపెట్టేస్తున్నారు. వారు తిరిగి ధర్మశాస్త్రమునకు వెళ్ళిపోయినా, మోషే బోధనలకు తిరిగి వెళ్ళిపోయినా, వారు కొట్టుకు పోయినా – ఇటువంటి క్రియలన్నియూ యేసు పట్ల వారికున్న గౌరవాన్ని తగ్గించివేస్తున్నాయి.

కాబట్టి, వారు చేయవలసిన పని ఏంటంటే, "యేసు మీద లక్ష్యముంచుడి" అని గ్రంథకర్త వ్రాస్తున్నాడు. "లక్ష్యముంచడం" అంటే, "స్పష్టంగా గ్రహించడం ... స్పష్టంగా అర్థంచేసుకోవడం, గురియుంచడం."[2] వారు యిలా చేయడం ద్వారా వారు ఆయన పట్ల నమ్మకస్థులైయుంటారు. మనమూ యేసు మీద లక్ష్యముంచడం ద్వారా మనం ఆయన పట్ల నమ్మకస్థులమైయుండగలము.

### నమ్మకస్థుడైన యేసు, మీద లక్ష్యముంచుడి (3:1–6ఎ)

మన వాక్యభాగంలోనూ, అలాగే హెబ్రీ పత్రికయంతటిలోనూ మనకు కనబడే మరో ముఖ్య అంశము "**ప్రభువుకు**" *నమ్మకమైన* యేసు (2, 6 వచనాలు గమనించు). యేసుని నమ్మకత్వం గురించిన అనేక ఉదాహరణలు మన వాక్య భాగంలో కనబడుతున్నాయి.

#### మనలను సహోదరులని పిలుచుటలో నమ్మకత్వము (3:1ఎ)

"మనలను సహోదరులని పిలుచుటకు యేసు సిగ్గుపడుట లేదు" (2:11; చూడు 17 వ.) అని మునుపటి అధ్యాయములో మనం చూశాము. "ఇందువలన పరిశుద్ధ *సహోదరులారా* ..." (3:1ఎ; నొక్కి చెప్పింది నాది) అన్న మాటతో ఈ అధ్యాయం ప్రారంభమవుతుంది. యేసుని *సోదరులముగా*[3] మనం "పరలోక సంబంధమైన పిలుపులో పాలు పొందుచున్నాము" (1బి వ.) – ఇది అరణ్యములో ఇశ్రాయేలీయుల పిలుపునకు విరుద్ధమైనది.

#### అపొస్తలుడుగా మరియు యాజకునిగా నమ్మకస్థుడు (3:1సి, 2ఎ)

"మనం ఒప్పుకొనిన దానికి యేసు అపొస్తలుడును మరియు ప్రధాన యాజకుడును" అని ఆయన గురించి చెప్పబడింది. అపొస్తలుడు అంటే "పంపబడినవాడు" అని అర్థం. మనుష్యుల యొద్దకు దేవుని చేత పంపబడినవాడు యేసు (చూడు మత్తయి 10:40; మార్కు 9:37; యోహాను 5:36). *దేవుని యొద్దనుండి మనుష్యుల యొద్దకు* రావడం యేసు యొక్క పనులలో ఒకటి. అలాగే ఆయన ప్రధానయాజకునిగానున్నాడు. ధర్మశాస్త్ర ప్రకారం, ప్రజలు

దేవుని యొద్దకు వచ్చునట్లు ప్రధాన యాజకుడు వారి నిమిత్తం విజ్ఞాపన చేయాలి. కాబట్టి యేసు యొక్క కార్యములలో మరో పని ఏంటంటే, *మానవులనుండి దేవుని యొద్దకు* వెళ్ళడం (చూడు 1 తిమోతి 2:5). G. C. Brewer ఈ రెండు పనులను యిలా చెప్తున్నారు: "దేవుని పక్షముగా ప్రజలతో మాట్లాడేవాడు ప్రవక్త ... ప్రజల పక్షముగా దేవునితో మాట్లాడేవాడు యాజకుడు."[4]

అపొస్తలుడుగా మరియు ప్రధాన యాజకునిగా "యేసు తన్ను నియమించిన వానికి *నమ్మకంగా* ఉండెను" (2ఎ వ.; నొక్కి చెప్పింది నాది). దేవుడాయనను ఏమి చేయుటకు పంపించాడో దానిని నిర్వర్తించడంలో ఆయన నమ్మకమైనవాడు (చూడు యోహాను 4:34; 5:30; 6:38).

**దేవుని ఇంటి మీద నిర్మాణకుడుగా మరియు యజమానిగా నమ్మకస్థుడు (3:2బి–6ఎ)**

ఈ లోకంలో యేసుని పనిని అనేక విధాలుగా వ్యక్తపరచవచ్చు (చూడు లూకా 4:43; 19:10). మన వాక్యభాగంలో, దేవుని ఇంటిని నిర్మించడం మరియు దాని గురించి శ్రద్ధ తీసుకోవడం ఆయన పని (3, 4, 6 వచనాలు).

దీన్ని ఆధారం చేసుకుని, యేసు నమ్మకత్వమును బట్టి, ఆయన "ఘనుడికంటె శ్రేష్ఠుడు" అని – అనగా మోషే కంటే శ్రేష్ఠుడు అని గ్రంథకర్త స్పష్టంచేస్తున్నాడు. యూదుల ప్రకారం, మోషే కంటే శ్రేష్ఠులెవ్వరూ లేరు. మోషే దూతల కంటెను శ్రేష్ఠుడని యూదులు భావించేవారు. హెబ్రీ గ్రంథకర్త తన వాదనకు సరైన తర్కమును తరువాతదిగా అందిస్తున్నాడు: యేసు దూతల కంటెను శ్రేష్ఠుడు అని అతడు ఇదివరకే నిరూపించాడు; ఇక ఇప్పుడు, దూతల కంటె శ్రేష్ఠుడుగా ఎంచబడుతున్నవానికంటె యేసు శ్రేష్ఠుడు అని ఇప్పుడు నిరూపిస్తున్నాడు.[5]

యేసు మరియు మోషేల మధ్య రెండు భేదములను గ్రంథకర్త చూపిస్తున్నాడు:

- యేసు ఇంటి నిర్మాణకుడు కాగా; మోషే దానిలో ఒక భాగం (3, 4 వచనాలు).
- యేసు కుమారుడు కాగా; మోషే పరిచారకుడు (5, 6 వచనాలు).

**మనలను ఆయన వారుగా గుర్తించుటలో నమ్మకస్థుడు (3:6ఎ)**

"క్రీస్తు కుమారుడైయుండి, ఆయన ఇంటిమీద నమ్మకముగా ఉన్నాడు – *మనమే ఆయన ఇల్లు*" (6ఎ వ.; నొక్కి చెప్పింది నాది) అని 6వ వచనం చెప్తుంది. మత్తయి 16లో యేసు తన సంఘమును నిర్మించుతాడని చెప్తుండగా (18 వ.), మరియు సంఘమే దేవుని ఇల్లు అని 1 తిమోతి 3:15 స్పష్టం చేస్తుంది. ఈ రోజున యూదులు గాక క్రైస్తవులే దేవుని ఇల్లయి యున్నారు. మనము ఆయనవారము మనము ఆయన నివాస స్థలము (ఎఫెసీయులకు 2:21, 22). ఎంత ఆధిక్యత! ఎంత ఘనత!

**యేసు మీద లక్ష్యముంచి, నమ్మకస్థులైయుండుడి (3:6ఎ–14)**

గ్రంథకర్త ఎంతో ఆచరణాత్మకంగా వ్రాస్తున్నాడు. యేసుని నమ్మకత్వమును ఉపయోగించి, మనమూ నమ్మకస్థులమైయుండాలని తన చదువరులకు ఆయన సూచిస్తున్నాడు.

**దేవుని ఇల్లుయియుండడం (ప్రజలైయుండడం) మాత్రమే చాలదు**

6వ మరియు 14వ వచనాల్లోని (if) "యెడల" అనే మాటను గమనించండి. ఇశ్రాయేలీయులు దేవుని ప్రజలు అయితే దానిని "స్థిరముగా చేపట్టలేదు." ఇశ్రాయేలీయుల అవిశ్వాసం గురించి చెప్తూ, 7 నుండి 11 వచనాలలో కీర్తన 95వ వాక్యభాగమును గ్రంథకర్త ఉదహరిస్తున్నాడు. దురదృష్టవశాత్తు గొప్ప నాయకులు విజయం విషయంలో గ్యారంటీగా నుండలేరు. మోషే గొప్ప నాయకుడు. ఈనాడు యేసు మరింత గొప్ప నాయకుడు. అయితే, మనం కూడా గొప్ప *అనుచరులమైయుండాలి.*

**మనం "స్థిరముగా" ఎలా ఉండగలము**

నమ్మకస్థులమై మనం యుండుటకు మన వాక్య భాగం మనకు ఎన్నో సూచనలు చేస్తుంది.

(1) *మనం పడిపోగలమని గుర్తించండి.* "If" "యెడలనే" (6, 14 వచనాలు) అనే పదం షరత్తును సూచిస్తుంది. ఇశ్రాయేలీయులు పడిపోయినట్లయితే, మనం కూడ పడిపోవగలము. ఇది జరుగకుండా మనం ఎంతో జాగరూకతతో ఉండాలి.

(2) *నిరీక్షణ కలిగియుండాలి* (6 వ.). "నిరీక్షణ" అనేది హెబ్రీ పత్రికలో ముఖ్య పదం (6:11, 18, 19; 7:19; 10:23). ప్రతిరోజు మనం మనుగడ సాగించాలంటే మనకు నిరీక్షణ అవసరం.

(3) *తుదముట్టుకు నమ్మకంగా ఉండుటకు ప్రయత్నించుదము* (6, 14 వచనాలు).

(4) *మన హృదయములు కఠినము గాకుండా జాగ్రత్తపడదాము* (8, 13 వచనాలు). *పాపం* ద్వారా *కఠిన హృదయం* కలుగుతుంది. ఇది *అవిశ్వాసమునకు* దారితీయగా ఇది *విశ్వాస భ్రష్టత్వమునకు* దారితీస్తుంది.




(5) *ఆత్మీయ జాగరూకతతో నుందము* ("జాగ్రత్త తీసుకో," 12 వ.).

(6) *నమ్మకస్థులైయుండుటకు ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ సరియైన దానినే చేద్దాము* (13 వ.). హెబ్రీ పత్రికలో గల "ఒకరినొకరము" అన్న వాక్య భాగములలో ఇది ఒకటి (చూడు 10:24, 25).

(7) *మనకున్నది "నేడే" అని గ్రహించండి* (7, 13 వచనాలు). మీరు చేయగలిగింది, ఈనాడే చెయ్యండి. వాయిదా వెయ్యకండి!

## ఉపదేశకులకు సూచనలు

హెబ్రీ పత్రికలో మనకు కనబడే రెండవ హెచ్చరిక 3:7లో ప్రారంభమవుతుంది (విషయ సూచికను చూడు). ఈ హెచ్చరిక నంతటిని ఒక పాఠముగా "గతంనుండి హెచ్చరిక" అను పాఠములో నేర్చుకుంటాము. ఈ పాఠం మరింత ఆచరణాత్మకంగా ఉండునట్లు మొదటి భాగం కొంచెం చెప్పబడింది. ఈ పాఠమును బోధిస్తుండగా, 4వ అధ్యాయం ప్రారంభముతో కలిపి 3:7-14 వాక్యభాగమును కూడ అధ్యయనం చేయనున్నామని గుర్తుంచుకోండి.

---

సూచనలు

[1]యేసును గురించి చెప్పబడిన ఇదివరకటి వాక్యభాగములను చూడండి. [2]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expositiory Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 123. [3]ఎప్పటివలనే "సహోదరులు" అనేది పురుషులు, స్త్రీలు, ఇద్దరినీ సూచిస్తుంది. [4]G. C. Brewer, *Brewer's Sermons: Christ Crucified* (Nashville: B. C. Goodpasture, 1952), 121. [5]William Barclay, *The Letter to the Hebrews* నుండి తీసుకోబడింది 3d ed., rev. and updated, The New Daily Study Bible (Louisville: Westminster John Knox Press, 2002), 35.